# బియాండ్ కాఫీ



'వాడు ముందు నా కుక్కను చంపేశాడండీ' అందామె.

'ఇప్పటికీ నాకు ఆ కుక్క అరుపులే వినిపిస్తూ ఉంటాయి. నిద్రలో కూడా వినిపిస్తూ ఉంటాయి. ఉలిక్కిపడి లేస్తూ ఉంటాను. పాపం... సునీల్'...

'సునీల్?'

'అవును. సునీలే. అది మా తమ్ముడి పేరు. వాడి పేరే నా కుక్కకు పెట్టుకున్నాను'

'తమ్ముడి పేరా?'

'ఎందుకు ఆశ్చర్యపోవడం? వాడిప్పుడు లేడు. పోయాడు. వాడిక్కూడా తెలియదు పోతాడని. దగ్గు వస్తోందని చెప్పాడు. ఇక్కడికే హైద్రాబాద్‌కు వచ్చి చూపించుకున్నాడు. ఎక్స్‌రే చూస్తూ డాక్టర్ పెట్టిన మొహాన్ని గమనించగానే అర్థమైపోయిందట పోతాడని. నేను కూడా ఎక్స్‌రే చూశాను. చిన్న డాట్‌లా కనిపించింది. ఒక్క నెల. డాట్ డాట్ డాట్ పెరిగిపోయి'....

ఫ్రెష్‌లైమ్ సోడా వచ్చింది. రెండు పొడవైన గ్లాసులు. లోపల కొంచెం బరువెక్కినట్టుగా కనిపిస్తున్న నీళ్లు. ముందుకు వొంగి గ్లాసు బయటకు వచ్చిన స్ట్రాలు. తెల్లవి.

'తాగండి' ఆమె అందుకుంది.

'ఊ' అన్నాను.

తగలొద్దు తగలొద్దు అనుకుంటాను ఇలాంటి కేసులకు. మళ్లీ తగులుతాను. ఏవో చెప్తుంటారు. చెప్తున్న వాళ్లందరినీ చెప్పిన వాటన్నింటినీ సరే అనం. కాని– ఏం చెప్తాం. అర్థం చేసుకోవాలి.

'మీరు ఇంతకు ముందు వచ్చారా?'

'లేదు ఇదే రావడం'

'ఇది తెలీదా. ఆశ్చర్యంగా ఉంది. మోస్ట్ హ్యాపెనింగ్ ప్లేస్. మీరెక్కువగా బయట తిరగరు లాగుంది'

'తిరగను'

'ఇటు రండి' లేచింది.

ఒక సిప్ కొట్టిన గ్లాసును చేతిలో పట్టుకుంది. నేను కూడా పట్టుకున్నాను. ముందుకు నడిచింది. నేను వెనుక. నల్ల జీన్స్ వేసుకుంది. ఫుల్ స్లీవ్స్ గ్రీన్ టీ షర్ట్. హైహీల్స్.

'ఇటు చూడండి'... చూపించింది.

గోడ మీద వరుసగా పెయింటింగ్స్ ఉన్నాయి. కొన్నింటి మీద పూర్తి సంతకాలు ఉన్నాయి. కొన్నింటి మీద పొట్టి సంతకాలు. దాదాపుగా ఆ పేర్లేవీ నాకు తెలిసే అవకాశం లేదు. 'ఆలయం' అనే సబ్జెక్ట్ తీసుకొని ఎవరో ఒక అరడజను పెయింటింగ్స్ వేసి ఉన్నారు. ఒక పూలసజ్జ పట్టుకున్న తమిళ యువతి. కళగా అందంగా ఉంది. మధురై టెంపుల్‌ది మరొకటి. లోపల నాలుగైదు చైర్లలో ఒక్కొక్కరే కూచుని వై ఫైకి కనెక్ట్ అయ్యి ల్యాప్‌టాప్‌లు పెట్టుకొని ఏదో పని చేసుకుంటున్నారు. బయట మేము కూచున్న ఓపెన్ ప్లేస్‌లో వెదురు పొదలు... ఒకో టేబుల్‌కు ఒకోటిగా వేసిన హట్స్... నల్లటి టేబుల్స్... నల్లటి కుర్చీలు... మంచి గాలి... ఎంతసేపైనా కూచోబుద్ధయ్యే ఆంబియన్స్... జూబ్లీహిల్స్‌లో రద్దీగా ఉండే చెక్‌పోస్ట్‌కు ఫర్లాంగు దూరంలో రోడ్డు మీద అలా ఎంటర్ కాగానే లోపల అంతా మారిపోయే ఇలాంటి ఒక చోటుందని తెలియదు.

'అందుకే దీని పేరే బియాండ్ కాఫీ. ఉత్త కాఫీ తాగడమేనా జనానికి పని? కూచోవాలి. మాట్లాడుకోవాలి. పెయింటింగ్స్ కొనుక్కోవచ్చంటే కొనుక్కోవచ్చు. బ్రౌజ్ చేసుకోవచ్చు. ఇంటర్వ్యూలు ఉంటే ఇక్కడే లాగించవచ్చు. ఉద్యోగం ఊడిపోయిందనుకోండి మళ్లీ దొరికే వరకూ ఇక్కడే ఒక నాలుగైదు వందలు ఖర్చు పెట్టుకుంటే రోజంతా గ్రీన్ టీ తాగుతూ ఉండిపోవచ్చు. సుఖంగా లేదూ? అందుకే ఇది బియాండ్ కాఫీ'

మళ్లీ వచ్చి మా టేబుల్ దగ్గర కూచున్నాం.

'మీకెలా తెలుసు ఇది?'

'ఎలా తెలుసా? ఒంటిగా ఉండే నా బోటి దానికి ఇలాంటివి తెలియక ఏం చేస్తాయి. వచ్చి ఇక్కడే కూలబడతాను. గ్రీన్ టీ- ఛీ... ప్రతిసారి గ్రీన్ టీ ఏంటి... నెక్స్ట్ టైమ్ మీకు ఇక్కడి స్పెషల్- అరకు కాఫీ తాగిస్తాను. అరకు నుంచి తెచ్చిన గింజలతో

అప్పటికప్పుడు చేసి ఇస్తారు. ఇంకెక్కడా దొరకదు. సూ...పర్' బొటనవేలిని చూపుడు వేలితో కలిపింది.

ఫ్రెష్ లైమ్ సోడా ముగించాను.

వాచ్ చూసుకున్నాను. ఎనిమిదిన్నర. ఇక్కడికి రావడానికి ఆఫీస్ నుంచి తొందరగా బయటపడ్డాను. ట్రాఫిక్. అడ్రస్ అర్థం కాక ఇంకో పది నిమిషాలు. ఇక్కడో అరగంట. చాలు. ఇంక బయట పడాలి.

'వెళ్దాం'

'వెళ్దామా!'

'ఏంటి?'

'ఏంటండీ... అంత టచ్ ఇచ్చారు?'

'టచ్చా?'

'మీరు నాకు ప్లాన్ చెప్పలేదు'

'ఏం ప్లాన్'

'అదే మా ఆయన్ని. వాణ్ణేసెయ్యాలి'

నాకు చల్లగా అయిపోయింది.

'మీ ఆయన్ని వేసేయడమేంటి?'

'అంటే– ఓ గాడ్– మీరనుకుంటున్నారా? మీరేసేయక్కర్లేదు. నేనేసేస్తాను. మీరు ప్లాన్ చెప్తే చాలు. అంటే ప్రాణాల్తో లేపేయడం కాదు. ఎక్స్‌పోజ్ చేయాలి. ఇలాంటి వాళ్లని ముఖానికి మసి రాసి వదిలిపెట్టాలి. అప్పుడు కరెక్ట్'

ఆమె వైపే చూశాను. ఇంతదాకా గమనించలేదు. కొంచెం తేడా ఉన్నట్టుంది. ఒళ్లో పెట్టుకున్న హ్యాండ్ బ్యాగ్ హ్యాండిల్స్‌ని పదే పదే నిమిరేస్తూ ఉంది. నిముర్తూ నిముర్తూ మాట్లాడుతూ... మాట్లాడుతూ మాట్లాడుతూ నిముర్తూ....

'రేపు మాట్లాడదాం'

'నో... నో... మీరు ఏదో ఒకటి చెప్పాల్సిందే. ఇంత పెద్ద రైటరూ... జర్నలిస్టూ... చేతిలో పేపర్ పెట్టుకొని... ఊ'....

పట్టుదలగా చూస్తూ ఉంది.

అభిమానులని కలవాలని ఎవరికి ఉండదు? కాని ఇలా జరిగితే ఫోన్ నంబర్ కాదు ఇక మీదట పుస్తకాల్లో ఈ మెయిల్ కూడా లేపేస్తే?

టైమ్ చూసుకున్నాను.

'సరే. ఒక అరగంట'

'ఏంటి అరగంట?'

'ఏదో చెప్పండి'

'ఈ అరగంట పావుగంట నా దగ్గర కుదర్దు. ఇన్నిసార్లు వెంటపడింది ఈ మాత్రం లింగు లిటుక్కుకా?'

అలాగే చూస్తూ ఉన్నాను.

'మనుషులంటే మీక్కూడా తేలిగ్గా ఉన్నట్టుంది మా ఆయనలాగా. ఏంటంత బిజీ. ఉండండి'

ఉత్తపుణ్యానికి సెల్ చేతిలోకి తీసుకున్నాను. ఉత్తపుణ్యానికి మెనూలోకి వెళ్లి ఇన్‌బాక్స్‌లోకి వెళ్లి చూసుకున్న మెసేజ్‌నే చూసుకుని మళ్లీ బ్యాక్‌కొచ్చి- భయం తెలియకూడదు కదా.

'చెప్పండి'

'ఫస్ట్ వాడు మా కుక్కను చంపేశాడు'

'ఎవడు?'

'మా ఆయన'

'ఎందుకు?'

'నేను సుఖంగా ఉండకూడదనీ'....

మనిషి లోగొంతుకలోకి వెళ్లిపోయింది. తల కొంచెం కిందకు దించుకుంది. ముఖం ఉదాసీనంగా మారిపోయింది. ఎదుటివాళ్లతో నిమిత్తం లేకుండా కష్టం చెప్పుకోవాలనుకునే మనిషి పెట్టే ముఖం అది.

'మా పెళ్లినాటికే మా అమ్మా నాన్నా చనిపోయారు. నాకు మిగిలిందల్లా నా తమ్ముడు. పెద్ద ఆఫీసరు. వెరీ జంటిల్‌మెన్. ఈసారి మీకు ఫోటో చూపిస్తాను. సోడా బుడ్డీ కళ్లద్దాలు పెట్టుకొని ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు. దేవుడి ముఖంవాడిది. వాడున్నాడని నాకు ధైర్యం. సరే. పెళ్లయి పోయింది. రోజులు గడుస్తున్నాయి. మా ఆయన సంగతి నాకు తెలిసి నేను సర్దుకునేలోపు వీడు పోయాడు. ఒక కొడుకు నాకు. మేనమామ పోలిక వచ్చింది వాడికి. ఐఐటి ముంబై కొట్టాడు. అక్కడికెళ్లాక వాడిలోకం వాడిది. ఆ తర్వాతైనా వాడు ఎటెటో వెళ్లిపోతాడుగాని నాకు దక్కేది ఏముంది. ఎప్పుడైనా ఫోన్లు. లేకుంటే మెయిళ్లు. లంకంత కొంప. పక్కలో బల్లెంలా మొగుడు.

నన్ను కాపాడింది సునీలే. బాస్టర్డ్... దాన్ని కూడా లేకుండా చేశాడు'...

'అంటే?'

'అంటే ఏంటి? నేను ఒంటరిగా ఉండాలి. నాకు పిచ్చెత్తాలి. నేను సంకనాకిపోవాలి. ఏం అర్థం కాలేదా?'

హ్యాండ్‌బ్యాగ్ హ్యాండిల్స్‌ని పదేపదే వేగంగా నిమిరేస్తూ ఉంది. ఇంకోటి కూడా గమనించాను. కుదురుగా కూచోలేకపోతూ ఉంది. రెప్పలు నార్మల్‌గా కొట్టుకోవడం లేదు. ఒక ధోరణి లేనట్టుగా వెంటవెంటనే ఆర్పుతోంది.

'డాక్సండ్ జాతి ఇష్టం నాకు'

'డాక్సండ్?'

'ఏం... మీకు కుక్కల గురించి ఏమీ తెలియదా?'

'ఏమీ తెలియదు'

'ఊహూ... ఇరవైనాలుగ్గంటలూ కూచుని కుయ్‌కుయ్ కుయ్‌కుయ్‌మని రాసుకోవడమేనా? మీలాంటివాళ్లు పెద్ద నసగాళ్లయి ఉంటారు. మీ ఆవిడ ఓకేనా? ఉందా ఇంకా?'

నేను మళ్లీ ఉత్తపుణ్యానికి సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకున్నాను. చూస్తున్నాను.

'నడుం పొడుగ్గా ఉండి కాళ్లు నేలకు అంటుకుపోయినట్టుగా ఉంటుంది చూడండి బుజ్జి కుక్క అదీ డాక్సండ్ అంటే. అది ఇష్టం నాకు. వెతికి వెతికి కొని దానికి సునీల్ అని పేరు పెట్టుకున్నాను. ఈ వెధవ క్యాంపులని పోయేవాడు కదా. తోడుగా ఉంటుందని అనుకున్నాను. కొత్తల్లో సూట్‌కేస్ సర్దడం, బ్రష్‌లూ పేస్ట్‌లూ అండర్‌వేర్‌లూ పెట్టడం, ఒకటికి నాలుగుసార్లు బట్టలు సరిచూడటం... వీడేదో ఏలడానికి పోతున్నట్టు. తీరా వీడు ఎక్కడికిపోతున్నాడో తెలుసా?'

'ఎక్కడికి?'

'ఎవర్తోనో పోవడానికి'

పళ్లు కొరుకుతున్నట్టుగా అనిపించిందిగాని అంతకు సమానంగా రెప్పలు కూడా టకటకా కొట్టుకున్నాయి.

'నేను సరిపోనా వీడికి? నా దగ్గర లేనిది ఏముంటుంది ఎవరి దగ్గరైనా? ఏముంటుంది మీరు చెప్పండి? ఏ ఆడదాని దగ్గరైనా ఏముంటుంది ప్రత్యేకంగా?' రెట్టించింది.

చూస్తూ ఉన్నాను.

నవ్వింది.

నవ్వినప్పుడు బాగుంది. ముక్కు మీద చాలా సన్నటి పుడక ఉంది. అది కూడా బాగుంది.

'మీకో కథ చెప్పాలి'

'కథా?'

'చిన్న కథే. మా నానమ్మ మణెమ్మ చెప్పింది. మా తాత కూడా ఈ ముండమోపి పనులతోనే మమ్మల్ని బికారుల్ని చేయబోయాడులేండి. అందుకని మా నానమ్మ ఈ కథను పదే పదే చెప్పేది. ఒక రాజంట. ఉత్త ముండల ముటాకోర్ అంట. కనిపించిన ఆడదాని వెంటల్లా పడేవాడంట. అలాగే మంత్రిగారి భార్య మీద కూడా కన్నేశాడంట. ఆ మంత్రిగారి భార్య మల్లెపూల వాసనతో ఉండేదట. కళ్లల్లో నీలాలు దాచుకొని ఉండేదట. ఒంటి మీద దానిమ్మ విత్తనాల రంగు ఉండేదట. అలాంటి ఆడది కావాలని వెంటపడ్డాడంట. కాదనడానికి లేదు. భర్త తల పోతుంది. లేదనడానికి లేదు. రాజ్యంలో నుంచి నీడే పోతుంది. సరే రమ్మనమనండీ అని కబురు చేసిందంట మంత్రి భార్య. రాజు వచ్చాడంట. వచ్చేసరికి గదిలో మంచం మీద మంత్రి భార్య కూచుని ఎదురుగా బల్ల మీద ఏడురంగుల ఏడు కూజాలను మూతలు పెట్టి ఉంచిందంట. ఎడంగా ఇంకో కూజాను ఎనిమిదో కూజాగా పెట్టిందంట. రాజు రావడంతోటే రాజా– ముందు ఆ ఏడు కూజాలలోని నీళ్లు తాగండి అన్నదంట. అప్పటికే కింద పడనా మంచాన పడనా అన్నట్టుగా ఆత్రపడి ఉన్న రాజు మారు మాట్లాడకుండా ఏడు కూజాలలోని నీళ్లూ తాగాడంట. ఎలా ఉన్నాయి అని అడిగిందంట మంత్రి భార్య. బాగున్నాయి అన్నాడంట రాజు. ఏడు కూజాల్లోని నీళ్లలో తేడా ఏమైనా ఉందా అని అడిగిందంట మంత్రి భార్య. లేదు అన్ని నీళ్లూ సమానంగానే ఉన్నాయి అన్నాడంట రాజు. మరి నీళ్లన్నీ సమానమే అయినప్పుడు ఈ ఎనిమిదో కూజా కోసం ఎందుకు ఆశపడుతు న్నావో చెప్పు అన్నదట. కొత్తగా నువ్వు తీర్చుకునే దాహం ఏముంటుంది అని కూడా అన్నదట. రాజు సిగ్గుపడ్డాడట. పడి వెళ్లిపోయాడట. ఈ కథను ప్రతి మగ నా బట్ట ఛాతీ మీద పచ్చబొట్టు పొడవాలని మా నానమ్మ ఎప్పుడూ అనేది'

టైమ్ చూసుకున్నాను.

తొమ్మిది దాటిపోయింది.

కాసేపు ఊరికే ఉన్నాను.

ఆమె కూడా ఊరికే ఉంది.

'వెళ్దాం'

'ఊ. వెళ్దామా'

వెయిటర్‌ని పిలిచి బిల్ తెమ్మనమని చెప్పింది.

మళ్లీ ఊరికే కూచుంది.

'ఐ యామ్ హ్యాపీ' అంది.

'ఎందుకు?'

'ఏం లేదు. కాసేపైనా మీతో కబుర్లు చెప్పాను. మామూలుగా అయితే ల్యాప్‌టాప్ తెచ్చుకొని ఏదో ఒక పుస్తకాన్ని బ్రౌజ్ చేసుకుని చదువుకుంటూ ఉంటాను. ఎప్పుడూ చదువుకుంటూ ఉండటం కూడా బోరే కదా'

'అవును'

ఏదో గుర్తొచ్చినట్టుగా సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకుని టచ్ స్క్రీన్ మీద మునివేళ్లను చకచకా కదిపింది. ఏదో ఫోల్డర్ వెతికింది. తలాడించింది.

'ఊ... ఇది చూడండి' సెల్ ఇటుకి తిప్పింది.

ఏదో వీడియో క్లిప్ ప్లే అవుతోంది.

'ఓ... ఓ... ఓ'... అదిరిపోయాను.

రెండు మూడు సెకన్లు కూడా కాలేదు.

సెల్‌ని తన వైపుకు తిప్పుకొని క్లిప్‌ను స్టాప్ చేసింది.

ఎవరో వయసొచ్చిన పిల్ల. స్నానం చేస్తోంది. కీ హోల్ దగ్గర పెట్టి లేదా కీ హోల్ లాంటిది ఏర్పాటు చేసి తీసి ఉంటారు.

చెమట పట్టింది.

ఆమె హ్యాండ్ బ్యాగ్ హ్యాండిల్స్‌ని పదేపదే వేగంగా నిమిరేసింది.

'ఇది మా ఆయన సెల్‌లోనిది. ఆయనకు తెలియకుండా నా సెల్‌లోకి ఎక్కించా'

ఏం మాట్లాడాలో తోచకుండా చూస్తూ ఉన్నాను.

'ఎవరిదని అడగరేం?'

'ఎవరిది?'

'మా బంధువుల అమ్మాయిది. ఏదో ఎగ్జామ్ రాయడానికి వచ్చి పది రోజులు ఉంది మా దగ్గర. అప్పుడు తీశాడు'

బిల్ వచ్చింది. నేను నటించకుండా చూస్తూ ఉన్నాను. తనే పే చేసింది. పిలిచింది తను.

'మనం రేప్పొద్దున కలుద్దామా బ్రేక్‌ఫాస్ట్‌కి?'

'బ్రేక్‌ఫాస్ట్?'

'ఏం? మీ ఆవిడ చేస్తేనే తింటాను అని ఒట్టు పెట్టారా. బ్రేక్‌ఫాస్టే'

'ఎక్కడా?'

'ఇక్కడే. రోడ్ నెం. 36. జూబ్లీహిల్స్. బియాండ్ కాఫీ'

వస్తాననిగాని రాననిగాని చెప్పకుండా బయటికొచ్చి బయలుదేరాను. డ్రైవ్ చేస్తూ ఉంటే ఆ క్లిప్పింగే గుర్తుకు వచ్చింది. మహానుభావుడి అవతారం ఎత్తి మర్యాద నటించడం ఆత్మద్రోహమే కాని అలాగని పూర్తిగా అదే అని కాదు. మంచీ చెడూ లోపల ఒకలాగా బయట ఒకలాగా కలగాపులగం అయిపోయింది.

పొద్దున ఆరూ ఆరున్నరకి రెండు మూడు బీప్‌లతో రెండు మూడు మెసేజ్‌లు వచ్చాయి.

'బియాండ్ కాఫీ. ఎట్ ఎయిట్ థర్టీ'...

వాకింగ్‌లాంటిది రోజూ చేస్తాను. అది చేయలేదు. పేపర్లు. అవీ చూళ్లేదు. బయలుదేరాను.

'ఇదేం చోద్యం?'

'ఫ్రెండ్‌ని కలవాలి'

'ఇడ్లీ పెట్టాను. ముందే చెప్పొద్దా'

షూస్ కట్టుకున్నాను.

'దారిలో ఎక్కడైనా నా నంబర్ రీచార్జ్ చేయించండి'

'సరే'

బయలు దేరాను. ట్రాఫిక్ ఎక్కువగానే ఉంది. ఇంత పొద్దున్నే బయలుదేరి మనుషులు ఎక్కడికి పోతారో. సిగ్నల్ దగ్గర ఆగితే ఫోన్ మోగింది. తనే అనుకుని చూశాను. కాదు. నంబర్ కనపడటం లేదు. దాని బదులు అక్షరాలు ఉన్నాయి. ప్రయివేట్ నంబర్ అని. మా ఆఫీస్‌లో ఒకరిద్దరు డైరెక్టర్లు ఇలాంటి సౌకర్యంతో ఫోన్ వాడతారు. వాళ్లు ఫోన్ చేస్తే నంబర్ కనిపించదు. ప్రైవేట్ నంబర్ అని డిస్‌ప్లే అవుతుంది. మనం తిరిగి వాళ్లకు ఫోన్ చేయలేము. కాని నాకు ఆ డైరెక్టర్లు ఫోన్ చేసే అవకాశం లేదు. ఇది ఎవరిది?

'హలో'

'ఆమెను కలవడానికి వెళుతున్నారా?'

'ఆమె ఎవరు?'

'నిన్న మీరు కలిశారే ఆవిడ'

'ఓ... ఆ.. ఆ.. అవును'

'కలవకండి'

'మీరెవరు?'

ఫోన్‌లో ఏదో కుక్క అదే పనిగా మొరుగుతూ ఉంది. అతడు 'ఏయ్ సునీల్.. ఏయ్ సునీల్' అని గదమాయించి మళ్లీ ఫోన్‌లోకి వచ్చాడు.

'నేను ఆవిడ భర్తను'

'అయితే?'

'ఆవిడ మాటలు నమ్మకండి. డేంజర్‌లో పడతారు. షీ ఈజ్ మ్యాడ్'...

ఒక చేత్తో ఫోన్ పట్టుకొని ఒక చేత్తో డ్రైవ్ చేస్తున్నాను.

'ఇంటికి పోండి'

అప్పటికీ ఏమీ తేల్చుకోకుండా నడుపుతున్నాను.

'సునీల్‌ని చంపేశానని చెప్పిందా?'

'అవును'

అతడు నవ్వాడు.

అవతలివైపు కుక్క అదే పనిగా గోలగా మొరుగుతూ ఉంది.

అతడు పెట్టేశాడు.

కారు పక్కకు తీసుకొని ఆపేశాను. చాలా గందరగోళంగా భయంగా అనిపించింది. లేనిపోని లంపటంలా అనిపించింది. వెనక్కు వెళ్లిపోతే? మళ్లీ ఫోన్ మోగింది.

'హలో'

'ఎక్కడున్నారు?'

'వ.. వచ్చేస్తున్నా. దారిలో ఉన్నా'

'తొందరగా రండి. ఆకలేసేస్తోంది బాబూ'

ఏదో లాగుతోంది నన్ను. ఏం లాగుతోంది? బయలుదేరాను.

ఈసారి నిన్న కూచున్న చోట లేదు. మూలనున్న వెదురు పొదల కింద ఉన్న టేబుల్‌లో కూచుని ఉంది. అక్కడ హాట్ అక్కర్లేదు. వెదురుపొదలదే నీడ. తెల్లటి, జుబ్బా లాంటిది వేసుకుని ఉంది. బ్లూ జీన్స్ తొడుక్కుని ఉంది. జుబ్బా మీద పెద్ద పెద్ద గ్రీన్ బటన్స్ ఉన్నాయి. మెడలో ఎత్నిక్‌గా కనిపించే లేత ఆకుపచ్చ దండ ఉంది.

‘ఊ. రాత్రి బాగా నిద్ర పట్టిందా?’

‘ఎందుకు పట్టదు?’

‘నేను నిద్రపోతే కదా?’

‘ఏం నిద్ర పట్టదా?’

‘సంవత్సరాలు’

చేతిలోకి మెనూ కార్డ్ తీసుకుంది. ఒక్కో లీఫ్ తిప్పుతూ ఒక్కో పదార్థం మీద వేలు జారుస్తూ ఉంది.

‘ఓట్ మీల్... బేక్డ్ బీన్స్... పాన్ కేక్స్... చికెన్ హామ్... పోర్క్ హామ్.... ఓ... సారీ సారీ... పోర్క్ చెప్పకూడదు కదూ... సారీ’...

వెయిటర్‌ని పిలిచి చికెన్ హామ్‌బర్గర్స్ ఆర్డర్ ఇచ్చింది.

‘ఇవయ్యాక మోనేస్ సన్‌రైజ్ తాగితే ఉంటుందీ’...

‘మోనేస్ సన్‌రైజ్?’

‘అదే... నిన్న చెప్పానే అరకు కాఫీ అని. దానికి ఇక్కడ పెట్టిన పేరు. ఏంటి మనకు పెయింటింగ్ గురించి ఏమీ తెలియదా?’

‘ఏమీ తెలియదు’

‘ఊహూ... ఇరవైనాలుగ్గంటలూ కూచుని టకుం టుకుం రాసుకోవడమేనా? కళ్లు పెద్దవి చేసుకోకపోతే ఎలా? మోనే చాలా పెద్ద పెయింటర్. ఆయన గీసిన సన్‌రైజ్ చాలా ఫేమస్. ఆ పెయింటింగ్ నుంచే ఇంప్రెషనిజమ్ అనే పెద్ద ఆర్ట్ మూవ్‌మెంట్ నడిచింది’...

నేను ఆమె వైపే చూశాను.

తల స్నానం చేసి చాలా శుభ్రంగా ఉంది. నిన్నటిలా బ్యాగ్‌ను ఒళ్లో పెట్టుకోకుండా పక్కన కుర్చీలో పెట్టుకుంది. కాకుంటే టేబుల్ అంచులను మాటిమాటికి తుడుస్తోంది. కనురెప్పలు యథావిధి.

ఆమె భర్త ఫోన్ చేశాడని చెప్పాలా వద్దా అని కాసేపు ఆలోచించాను.

ఇప్పుడు కాదు.

‘మార్నింగ్స్ మీకు ఇష్టమేనా?’

‘ఎవరికి ఇష్టం ఉండదు?’

‘అలా ఊరికే ఫ్యాషన్ కోసం చెప్పడం కాదు. సన్‌రైజెస్‌ని నిజంగా ఇష్టపడాలి. ఎలా ఇష్టపడాలంటే సూర్యుడూ మనమూ ఎదురూ బొదురూ కాకపోతే ఆ రోజంతా

వెలితి ఫీలైపోవాలి. పెద్దవాళ్లు ఊరికే చెప్పారటండీ ప్రభాతమని? మనసులోని కుళ్లును కడిగేసే వెలుగు అది. ప్రయత్నించాలేగాని ఆ వెలుగులో మనం స్వచ్ఛంగా మారిపోతాం'

కళ్లలో కళ్లు పెట్టి చూసింది.

స్వచ్ఛంగా చూసింది.

మళ్లీ తల దించుకుంది. బెంగగా ముఖం పెట్టింది.

'ఇలాంటి ఒక తెల్లారే– అప్పుడు మావాడు టెన్త్‌లో ఉన్నాడు. నేను లాన్‌లో కూచుని కాఫీ తాగుతున్నాను. ఈ వెధవ నిద్రపోతున్నాడు. మావాడు చాలా డిస్టర్బ్‌డ్‌గా వచ్చి నా ఎదురుగా ఫోన్ పడేశాడు. ఈ వెధవదే అది. అప్పుడప్పుడు దాంతో ఆడుతుంటాడు మావాడు. చూడు మమ్మీ... డాడీ... వెరీ డర్టీ... అనేసి వెళ్లిపోయాడు. నేను ఫోన్ వైపు చూశాను. ఏదో క్లిప్పింగ్ ప్లే అవుతూ ఉంది. వీడికి తెలియక ఓపెన్ చేశాడు. జుగుప్స. కంపరం ఒళ్లంతా. టక్కున దానిని చేతుల్లోకి తీసుకొని ఒణుకుతున్న వేళ్లతో స్టాప్ చేశాను. ఏం పని ఇది? ఈ వయసులో? ఇంత దాటి వచ్చాక? యూ సీ... మనం మరీ ఎక్కువగా ఆశించి మాట్లాడుకోకూడదు. వియ్ ఆల్ నో వాట్ మెన్ ఆల్వేస్ వాంటెడ్ టు వాచ్. కొంత అర్థం చేసుకోవచ్చు. కమర్షియల్ పార్నోగ్రఫీకి కూడా ఒక హార్మ్‌లెస్‌నెస్ ఉంటుంది. కాని ఇది అలాంటిది కాదు'.....

ఆర్డర్ వచ్చింది.

తెల్లటి అందమైన ప్లేట్లలో సర్దిన హామ్‌బర్గర్స్. సాస్. గ్లాసులు. వాటర్.

వెయిటర్ రెండు ప్లేట్లనూ ఇద్దరికీ దగ్గరగా జరిపి వెళ్లాడు.

'తీసుకోండి'

'ఊ'

ఆమె బర్గర్‌ని రెండు చేతులతోనూ తీసుకొని నోరంతా తెరిచి పెద్ద భాగాన్ని కొరికి నోట్లోకి తీసుకుంది. ఒక్కళ్లమే ఉంటే పర్లేదుగాని ఎదుటివాళ్లు చూస్తూ ఉండగా అలా తినడం నాక్కొంచెం ఇబ్బంది. పైగా చొక్కా మీద వేసుకోకుండా ఏదీ తినలేను.

'తినండి'

'సరే'

చేతిలోకి తీసుకున్నాను.

ఆమె నములుతూ మింగుతూ అంది.

'మీరు కూడా చూస్తారు కదా'

కొంచెం టంగుటంగుమంది.

'ఏంటి?'

'అర్థం కానట్టు ఆ దొంగమొకం ఎందుకూ?'

'అంటే'...

'మీరేంటి... దొరికితే మగ వెధవలంతా అంతే. అసెంబ్లీలో చూడ్డానికే రెడీ అయి పోయారు. గుళ్లో చూడ్డం ఒక్కటే బాకీ'....

మళ్లీ ఇంకో ముక్క కొరికింది.

'ఒక ప్రశ్న అడుగుతాను జవాబు చెప్పండి'

'అడగండి'

'మొబైల్‌ఫోన్‌లో వీడియో కెమెరా ఎందుకండీ?'

ఏం చెప్పాలో తెలియనట్టుగా చూశాను.

'ఫొటో అంటే నా చిన్నప్పుడు పెద్ద తతంగం. మూడు నాలుగురోజుల ముందే అనుకొని మంచి బట్టలు ఏర్పాటు చేసుకొని స్నానాలు చేసి శుభ్రంగా తయారయ్యి స్టుడియోకు వెళ్లి... లేకుంటే ఏదైనా ప్రత్యేక ఘట్టంలో... శుభకార్యంలో.... ఫొటో తీశామంటే ఆ క్షణానికో విలువుండాలి. దానికో జ్ఞాపకం ఉండాలి. మొబైల్స్ వచ్చాక చూడండి. తుమ్మినా ఫొటో. దగ్గినా ఫొటో. కింద పడ్డా ఫొటో. పైకి లేచినా ఫొటో. ఏం ఇదేమైనా జాతర? పగటి వేషగాళ్లమా మనం? అంత ఏముంటుందండీ ప్రతీ దానికీ? ఇంక వీడియో షూట్ అంటే దానిక్కూడా ఎంత పెద్ద సందర్భం ఉండాలి. ఎంత మంచి జ్ఞాపకం కావాలి. ఒక ఈవెంట్ అయితేనో... ఒక లెక్చర్‌ను రికార్డ్ చేయడానికో... ఒక మహాత్ముడో పెద్దమనిషో వచ్చాడనో... పెళ్లి క్యాసెట్టుకో... ఇప్పుడు చూడండి ఏమయ్యిందో'...

మనిషి మారుతూ ఉంది.

బర్గర్‌ను ప్లేట్‌లో ఉంచి టేబుల్ అంచుల్ని పదేపదే వేగంగా తుడవడం మొదలు పెట్టింది.

తల కొంచెం దించి పెదాలు కదిలేలా గొణిగింది.

చూస్తూ ఉన్నాను.

ముఖం మారుతూ ఉంది.

చివాలును తల ఎత్తింది.

'నేను చూశానండీ అదంతా' అరిచింది.

అదిరిపడ్డాను.

అటూ ఇటూ చూసింది.

అవతలి టేబుల్ల వాళ్లు ఒక క్షణం గమనించి మానుకున్నారు.

సర్దుకుంది.

'ఛీ.. ఇది శిక్ష. పనిష్మెంట్. అసహ్యం. షిట్. కాని చూశాను నేను. అసలు ఏమిటా వీడి సంగతి అని మళ్లీ మొబైల్ తీసుకొని ఫోల్డర్ ఓపెన్ చేసి అన్ని క్లిప్పింగ్స్ చూశాను. ఏమిటవి? ఇక్కడివే. ఈ దేశానివే. ఇక్కడి ఆడవాళ్లవే. నమ్మకద్రోహం. మీ మగవెధవల నమ్మకద్రోహం అది. భార్యలతో, గర్ల్‌ఫ్రెండ్స్‌తో, ప్రాస్టిట్యూట్స్‌తో మీరు చేసిన దరిద్రమంతా మొబైల్స్‌లో రికార్డ్ చేసి– అదేదో సరదాగా చేస్తున్నట్టుగా నటిస్తూ– లేకుంటే వాళ్లకు తెలియకుండా తీస్తూ– గొప్ప కోసం ఫ్రెండ్స్‌కు చూపించి అక్కణ్ణుంచి అవి చేతులు మారి దేశమంతా... ప్రతి మొబైల్‌లో సిడిల్లో పెన్ డ్రైవ్స్‌లో... అక్కచెల్లెళ్లు కాదా వాళ్లు... మన ఇంటి ఆడవాళ్లు కాదా వాళ్లు.. బతుకుతారా వాళ్లు ఇది తెలిస్తే? స్టూడెంట్స్‌ని... ఆఖరికి ప్రీటీన్ పిల్లల్ని కూడా మభ్య పెట్టి.... అన్నం దొరుకుతుందా మీకు? నీళ్లు ముడతాయా? ఏం సేఫ్ మనం? నేను సేఫా? మీ వైఫ్ సేఫా? పర్వర్టెడ్ బాస్టర్డ్స్'....

ఎగశ్వాస తీసుకుంటూ ఆగింది.

ఆమె నన్ను తిడుతోంది. ఆమె భర్తను తిడుతోంది. నన్ను తిడుతున్నట్టుగా ఆమె భర్తను.

అలాగే చూస్తూ కూచున్నాను.

ఆమె కొంచెం కొంచెంగా నెమ్మదించింది. అంచుల మీద చేతుల వేగం తగ్గింది. మళ్లీ బెంగగా తల దించుకుంది.

'ఆ రోజు నుంచే కష్టాలు మొదలయ్యాయండీ నాకు. ఎప్పుడైతే అవి చూసి నేను ప్రొటెస్ట్ చేయడం మొదలుపెట్టానో అప్పట్నించే'....

ఊరికే ఉండిపోయింది.

కాఫీ వచ్చింది.

మోనేస్ సన్‌రైజ్.

ఆ పరిమళం ఆమెను ఇంకాస్త శాంతపరిచింది.

'మీ పేపర్‌లో ఒక మూవ్‌మెంట్ స్టార్ట్ చేయగలరా మీరు?'

'ఏం మూవ్‌మెంట్?'

'అదే.. మొబైల్స్‌లో కెమెరాలు బేన్ చేయాలనే మూవ్‌మెంట్. ఇప్పుడూ... అల్లోపతి వచ్చిన కొత్తల్లో మన దేశంలో ఏం చెప్పారండీ? అల్లోపతి గొప్పది... పత్యం అక్కర్లేదు అనేగా? ఇప్పుడు పత్యం చెప్పని అల్లోపతి డాక్టర్ ఉన్నాడా? అసలు అల్లోపతే పనికిరాదని ఆల్టర్నేటివ్ మెడిసిన్ వైపు పోవడం లేదా మనం. అంతే. టెక్నాలజీ మంచిదే అని తెచ్చుకుంటాం. అది చెడ్డది అని తేలాక వద్దు అని బేన్ చేయొచ్చుగా. ఫోన్ అంటే మాట్లాడ్డానికి మాత్రమే. లేకుంటే ఏమవుతుందంటే అసలే ప్రతివాడికీ రెండు కళ్లు... మొబైల్‌తో కలిపి మూడో కన్ను. ప్రతి వెధవా ఒక ముక్కంటా? శివుడికైతే చెల్లుతుందిగాని'

ఊరికే కూచున్నాను.

వెదురు ఆకులు కూడా రాల్తాయ్.

ఆమె మరికాసేపు కాఫీ తాగింది. కప్పు వైపే చూస్తూ అడిగింది.

'వంట చేస్తారా మీరు?'

'ఏంటి?'

'ఊహూ... ఎవరైనా చేస్తే మెక్కడమేనన్న మాట. ఏదో నవాబుగిరీ కదా. మంచి పులావ్ చేస్తే ఇంటికొచ్చి తిందామనుకున్నా. మీరు కూడా అంతేనన్నమాట. గెస్టులను పిలిచి ఆ తలనొప్పంతా ఆడవాళ్ల మీద వేసి. ఏం వండలేరా మీరూ?'

ఏం చేయాలో తోచక సెల్ చేతిలోకి తీసుకున్నాను.

కాఫీ తాగుతూ తాగుతూ అంది.

'ఈ వెధవ భలే వండేవాడండి. ఇంజనీరింగ్ కాలేజ్‌లో మేం క్లాస్‌మేట్స్. ఆదివారం రూమ్‌కి వెళితే నాటుకోడి పట్టుకొచ్చి ఒక్కోసారి చింతచిగురు.. ఒకోసారి ఉత్త కరివేపాకు... ఒకోసారి మెంతి కూర.... అదరగొట్టేసేవాడు. నేనంటే చాలా ప్రేమలేండి. మనం బాగుండాలి.. బాగా బతకాలి అని... పెళ్లయ్యాక నన్ను మా గుంటూర్లో ఉంచి ఇక్కడ ఫర్మ్ ఎస్టాబ్లిష్ చేయడానికి అన్నం నీళ్లు మాని ఐదేళ్లు కష్టపడ్డాడు. పెట్టుబడి ఎక్కడిదని అడగరేం?'

'ఎక్కడిది?'

'నాదే. మా ముసల్ది నా మనవరాలికి ఉండాలని ఐదెకరాలు దాచి పెట్టింది ఎప్పుడో. అది అమ్మి ఇచ్చాను. ఇక్కడ మరీ అన్యాయం. మీవాడే నవాబు గారట– ఎకరా మూడు లక్షలకు– లేకే జావ్ లేకే జావ్ అని ఇచ్చాడట. నాలుగు ఎకరాలు. ఇప్పుడు ఒకో ఎకరా పద్నాలుగు కోట్లు'

నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంది.

ఇంకో నాప్‌కిన్ తీసి నాకు అందించింది.

'డివోర్సంటే ఇదొకటి తేలాలి. ఉమ్మడిగానే ఉన్నాయి అన్ని. అందుకని వాడు కదల్డం లేదు. అదీగాక నన్ను వదులుకోవడం కూడా ఇష్టం లేదు. నేనుండాలి. వాడికి అడ్డు చెప్పకుండా ఉండాలి. వాడు తానా అంటే నేను తందానా అనాలి. నేను అనను. డివోర్సంటాను. అది వాడికి నష్టం. హత్యలూ గిత్యలూ ప్లాన్ చేసేంత ధైర్యస్తుడు కాడు. పిరికి వెధవ. కొడుకు ముందు కూడా తలెత్తుకుని ఉండాలి కదా. అందుకని ఇలా ప్లాన్ చేశాడు. నెమ్మది నెమ్మదిగా నన్ను ఒంటరిదాన్ని చేసి... పిచ్చి పట్టించి'... ఆగింది.

'ఎవరితో చెప్పుకోను... తమ్ముడు బతికుంటే... అయినవాళ్లే లేని బతుకైపోయిందే'.... కళ్లల్లో కొంచెం కన్నీళ్లు వచ్చాయి. కొంచెమే. వెంటనే నాప్‌కిన్‌తో అద్దేసింది.

'వీడు ఎప్పుడోగాని ఇంటికి రాడండి. వచ్చినా మాకు మాటల్లేవు. సునీల్ ఉంటే చాలు నాకు. ఎవరు ఉన్నా లేకున్నా డోన్ట్ కేర్. అది గమనించాడు. ఒకరోజు నేను వద్దు వద్దంటున్నా వినకుండా వ్యాక్సిన్ వేయించుకు వస్తానని తీసుకెళ్లి చంపి పారేసి ఏమీ ఎరగనట్టుగా'.....

వెక్కి వెక్కి ఏడ్చింది.

'సునీల్... ఎంత ముద్దొచ్చేదో తెలుసా అండీ. కళ్లతోనే ఎన్ని మాటలు మాట్లాడేదో తెలుసా? ఎంత ప్రేమగా నిజాయితీగా ఉండేదో తెలుసా? నీకెందుకు నేనున్నానుగా అని పులిలా ఇల్లంతా కాపలా కాసేది. లేకుంటే కాళ్ల దగ్గరే కూచుని ఉండేది. మనిషి కుక్కలా ఎప్పటికి మారగలడో కదా'.....

నాకు నోటి దాకా వచ్చింది.

ఆమె భర్త ఫోన్ చేశాడని. ఫోన్‌లో సునీల్ అరుపులు విన్నానని.

ఆమె చెప్పింది.

'వాడెంత సిస్టమేటిక్‌గా టార్చర్ ప్లాన్ చేశాడో తెలుసా అండీ. సునీల్ అరుపులు రికార్డ్ చేసి మా పిసిలో లోడ్ చేశాడు. ఉదయాన్నే కావాలని పిసి ఆన్ చేసి లౌడ్ స్పీకర్లలో దాని అరుపులు వినిపిస్తాడు. అవి వింటూ నేను వెర్రెత్తి పోవాలన్న మాట'.....

నేను నిశ్శబ్దంగా అయిపోయాను.

ఎవరు సత్యం ఏది సత్యం అర్థం కాకుండా ఉంది.

ఈమే సత్యం.

ఈమె సత్యమా?

'ఇంకో డాండక్స్‌ను కొనుక్కోకపోయారా?'

'డాండక్స్ కాదు డాక్సండ్'

'అదే అదే'

'మీకు కుక్కల గురించి తెలియనప్పుడు ఊరికే ఉండొచ్చుగా'

'సారీ... సారీ'

'అందరికీ అన్ని కుక్కలు మేచ్ కావు. అన్నిసార్లు అన్ని కుక్కలూ మేచ్ కావు.'

వెయిటర్ వచ్చి ఇంకేమైనా కావాలా బిల్లు తేవాలా అన్నట్టుగా నిలుచున్నాడు.

'ఇంకేమైనా?'

'వద్దు. వెళ్లాలి'

'ఇంకొంచెం కాఫీ?'

'వద్దు. థ్యాంక్స్'

బిల్లు వచ్చింది. కొంచెం నటించాను. ఆమె పట్టించుకోకుండా బ్యాగ్ తెరిచి బిల్లు పే చేసింది. తర్వాత చెక్‌బుక్ తీసింది.

'మీ స్పెలింగ్ చెప్పండి'

'ఎందుకు?'

'అడిగింది చేయొచ్చుగా?'

స్పెలింగ్ చెప్పాను.

రాసి సైన్ చేసి ఇచ్చింది.

'ఎందుకు?'

'ఊరికే. మీ పబ్లికేషన్స్‌కు సపోర్ట్ కోసం'

నటించాను. నటించలేదు. రెండూ చేశాను.

'సంతోషమే. కానీ...'

'జేబులో పెట్టుకోండి'

పెట్టుకున్నాను.

ముఖంలో ముఖం పెట్టి చూస్తూ అంది.

'థ్యాంక్యూ'

'ఎందుకు?'

'సమ్ ఆఫ్ యువర్ స్టోరీస్ ఆర్ యాంటీ డిప్రెసెంట్స్. మీలాంటి వాళ్లు రాయాలి'

ఊరికే ఉన్నాను.

లేచింది.

ఇద్దరం బయటకు వచ్చాం.

'మీరు ప్లాన్ చెప్పలేదు'

'ఏం ప్లాన్?'

'అదే... మా వెధవది. నన్ను లైవ్‌లో కూచోబెట్టవచ్చు కదా మీ చానెల్‌లో. బ్యాక్‌గ్రౌండ్‌లో ఈ వెధవ ఫొటో పెట్టి. నేను మొత్తం చెప్తాను కదా. ఈ అమ్మాయి క్లిప్పింగ్ సరిపోదా'

'అలా చేస్తే ఆ అమ్మాయి ఎక్స్‌పోజ్ అవుతుంది'

'అదే కదా'

'మీ అబ్బాయ్ సంగతి కూడా మీరు మర్చిపోతున్నారు'

'ఊ'...

'ఏంటంటే మీరిద్దరూ ఎలా మట్టిగొట్టుకుపోయినా పర్వాలేదు. మీ అబ్బాయ్ సఫర్ కాకుండా చూసుకోండి. మీరిద్దరూ రచ్చకెక్కితే- వాళ్ల నాన్న గురించి అమ్మ- అదీ ఏ ఫ్రాడో గీడో అంటే పర్లేదు- ఇలాంటి వ్యవహారాల్లో అంటే పిల్లలు తట్టుకోవడం కష్టం. మీ అబ్బాయికి తెలియకుండా లేదా బయట గోల జరక్కుండా ఏమైనా కరెక్ట్ చేయగలరేమో ఆలోచించండి'

ఆమె తల అడ్డంగా ఆడించింది.

'వాడేం మారతాడండి... చిత్తకార్తె వెధవ'...

చెంపలు వేసుకుంది.

'తప్పు తప్పు. కుక్కల్ని ఏమీ అనకూడదు. వాటికీ ఒక సీజన్ ఉంటుంది. వాటికీ ఒక నీతి ఉంటుంది. మగాళ్లలా కాదు'

నేనే అన్నట్టు చూసింది.

'మీకు తెలుసా?'

'ఏంటి?'

'ఈ మధ్య తాష్కెంట్‌కు చక్కర్లు కొడుతున్నాడు'

'తాష్కెంట్?'

'అవును. ఉజ్బెకిస్తాన్‌కు ఏం ఖర్మ పట్టిందో చూడండి'

ఇద్దరం పార్కింగ్ దగ్గరకు వచ్చాం.

ఇద్దరం విడిపోయాం.

ఆఫీసుకు వస్తే కాసేపు తోచలేదు. ఫేస్‌బుక్‌లో మా అబ్బాయ్... మా చెల్లాయ్... పార్క్‌లో నేను... అని ఎవరెవరో ఫొటోలు పెట్టి ఉంటే చూస్తూ కూచున్నాను.

ఫోన్ మోగింది.

ప్రయివేట్ నంబర్.

'హలో'

'నేను చెప్పినా విన్లేదు'

'అవును'

'కలవొద్దంటే కలిశావ్'

'అవును'

'పోతావ్ అంటే వినవురా'

'అవును'

'ఏయ్... పిచ్చిపిచ్చిగా ఉందా. నీ పైవాళ్లతో మాట్లాడనా?'

'మాట్లాడితే?'

'మాట్లాడితేనా? ఏం... పొగర్రా? అయిపోతావ్. మీ జగన్ బయటికొస్తాడనుకుంటున్నావా? మీ పేపర్ ఉంటుందనుకుంటున్నావా?'

'నువ్వు పెట్టు బాబాయ్'

'బాబాయా'

'పెట్రా గన్నాయ్'

పెట్టేశాడు.

మళ్లీ ఫేస్‌బుక్ చూస్తూ కూచున్నాను. ఎవరెవరివో ఏవేవో భావాలు. 'నీడలు ఎన్నయినా దూరాలు తీరాలేలే'... లాంటి కోట్స్ కొందరు పెట్టి ఉన్నారు. చూస్తూ ఉన్నాను.

మళ్లీ ఫోన్ మోగింది.

ప్రయివేట్ నంబర్.

'హలో'

'సర్. నేను చెప్పేది వినండి'

'చెప్పండి'

'షి ఈజ్ మ్యాడ్. కావాలంటే ఈసారి అడగండి. తను మెడికేషన్ మీద ఉంది. కావాలంటే అడగండి. హెల్యూసినేషన్స్ ఉంటాయి తనకు. జరిగినవి జరగలేదనుకుంటుంది. జరగనివి జరిగాయనుకుంటుంది. పెళ్లయినప్పటి నుంచి తను నన్ను వదిలింది లేదు. కొంచెం కూడా స్వేచ్ఛ ఇచ్చింది లేదు. మగాళ్లన్నాక చిన్నాచితకా ఏవో సర్దాలుంటాయి. వాటిని భూతద్దంలో నుంచి చూసి రాద్ధాంతం చేస్తూ ఉంటుంది. నన్ను ఎన్నిసార్లు కొట్టిందో మీకేం తెలుసు'....

ఆగాడు.

గొంతు నిజంలా అనిపిస్తోంది.

నిజంలాంటిదా?

'స్టిల్ ఐ లవ్ హర్. ఏవో పొరపాట్లు జరిగాయి నా వల్ల కూడా. దానికే డిప్రెసివ్ అయిపోయింది. అందుకే కంటికి రెప్పలా చూసుకుంటూ ఉంటాను. ఎవ్వర్నీ కలవనివ్వను. పిచ్చిది కదా ఏం ప్రాణం మీదకు తెచ్చుకుంటుందోనని. ఫోన్ టాప్‌లో పెట్టాను. ఇప్పుడు చెప్పండి. నేనా బాధితుణ్ణి. ఆవిడా?'

ఏం గోల ఇది నాకు.

'సరే'

'ఏం సరే'

'మీ ఖర్మ. నన్ను వదిలిపెట్టండి'

పెట్టేశాను.

ఆ తర్వాత నేను వాళ్లను పట్టించుకోలేదు. ఆఫీసులో కూడా కుదరలేదు. ఏవో మార్పుచేర్పులు. వేరే పేజీ బాధ్యతలు అప్పజెప్పారు. మళ్లీ ప్రూవ్ చేసుకోవాలి. పని ఎంత పాతదయినా ఎప్పుడూ ఒక కొత్త ఉంటుంది. దానికి అడ్జస్ట్ అయ్యేలోపు మూడు నాలుగువారాలు గడిచిపోయాయి. ఆమె ఫోన్ చేసింది.

'హలో'

'సాయంత్రం కలవకూడదూ మంచి డెవలప్‌మెంట్స్ ఉన్నాయ్. చెప్తాను'

'సాయంత్రమా?'

'ఏం... ఏంటంత బిజీ. కంప్యూటర్ ముందు కూచుని కుచుకుం కుచుకుం కీబోర్డ్ నొక్కుకోవడమేగా?'

చెక్కు తీసుకున్న విశ్వాసం ఉంది.

'ఎక్కడా?'

'అక్కడే'

వెళ్లాను.

ఈసారి ఇన్నర్ స్పేస్‌లో కూచుని వైఫైకి కనెక్ట్ అయ్యి ల్యాప్‌టాప్‌లో ఏవో పాటలు వింటున్నట్టుంది. హెడ్‌ఫోన్స్ ఉన్నాయి. నన్ను చూసి హెడ్‌ఫోన్స్ తొలగించుకుంటూ నవ్వింది.

'ఈ మధ్య మిమ్మల్ని తలుచుకుని రెండు మూడుసార్లు నవ్వుకున్నాను'

'ఎందుకు?'

'మా కుక్క ఏ జాతిదో చెప్పండి'

'డాండక్స్'

'టాన్‌టెక్స్‌లాగా భలే గుర్తుపెట్టుకున్నారండీ. అది డాక్సండ్' నవ్వింది.

కూచున్నాను.

'కోల్డ్ కాఫీ ట్రై చేస్తారా?'

'చేయొచ్చు'

'డాలీస్ డిలైట్'... రెండు చెప్పింది.

అంటే ఏంటో అడగలేదు. దాని వెనుక ఏం కథ ఉందో.

కాఫీ వచ్చింది.

తాగుతూ కూచున్నాం.

ఆమె నా వైపు నిరాశగా చూసింది.

'మీతో ఏమిటి మాట్లాడటం?'

'ఏం?'

'కుక్కల గురించి మీకేమీ తెలియదే'

చూస్తూ ఉన్నాను.

ఆమె చెప్పింది.

'ఇప్పుడూ... మీ ఇంట్లో ఫిరానా డెయిన్ ఉందనుకోండి... అంటే ఏంటని అడక్కండి... ఏనుగంత ఉండే కుక్క... అది మీతో ప్రేమగా ఉంటూ ఒకరోజు హటాత్తుగా మిమ్మల్ని చూసి కోరలు చూపించి కరుస్తా అన్నట్టు ముందుకొచ్చిం

దనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు?'

'భయపడతా'

'ఉత్త భయపడ్తారా? పోసుకొని యానిమల్ ట్రైనర్‌కు ఫోన్ చేస్తారు. ఒరే బాబూ... దీని సంగతి చూసి పోరా అని. అవునా?'

'అవును'

'అదే మా డాక్సండ్ ఉందనుకోండి. బుజ్జిది. కుయ్‌కుయ్‌మంటూ ఉంటుంది. అది ఉన్నట్టుండి ఏయ్ ఏమనుకున్నావ్ అని బెదిరించిందనుకోండి. ఏం చేస్తాం?'

చూస్తూ ఉన్నాను.

'నెత్తి మీద చిన్నగా మొట్టి నీ ముఖంలే వెర్రిముండా అని ముద్దు చేస్తాం. అవునా?'

చూస్తూ ఉన్నాను.

ఆమె సీరియస్ అయిపోయింది. చాలా.

'అదే మనం చేసే తప్పు'

ఇంకా సీరియస్ అయిపోయింది. ముఖం మారిపోతూ ఉంది. రెప్పలు టపాటపా కొట్టుకుంటున్నాయి. మూత పెట్టిన ల్యాప్‌టాప్ మీద చేతులు పదే పదే కదిలిపోతున్నాయ్.

'కుక్కకేం తెలుసు. చిన్నదో పెద్దదో. అది ఒక ప్రాణం. అన్ని కుక్కల ప్రాణాలతో పాటు దాని ప్రాణం కూడా సమానం. పెద్ద కుక్కయితే ఒకలాగా చిన్నకుక్కయితే ఒకలాగా ఏంటిది? సైజ్‌ను బట్టి డిసైడ్ చేస్తావా? జెండర్‌ను బట్టి డిసైడ్ చేస్తావా? ఆడవాళ్లు ప్రొటెస్ట్ చేస్తే... ఆ ఏముందిలే అనుకుంటే ఎట్లా? నీ కంటే బలహీనమనా నీ పొగరు. నీ మీద డిపెండెంట్ అయ్యిందనా నీ పొగరు. ఆ... ఇద్దరు ముగ్గుర్ని కని పడేశాము ఎక్కడికిపోతుంది పడి ఉంటుందనా నీ పొగరు. ఏం పొగరు అది? నువ్వు సేమ్ అయితే నేనూ సేమే. నువ్వు ఎవరితోనో పోతానంటే నేనూ పోనా. వద్దనుకుంటున్నానే. పశువులమా మనం? అర్థం కాదా? భార్యల ప్రొటెస్ట్‌ను సీరియస్‌గా తీసుకోకనే- అది ఏ విషయానికైనా- అనర్థాలు. ఆమె ఏదో ఒక అఘాయిత్యం చేస్తే తప్ప వాడు మేల్కోడు. అప్పటికి అంతా అయిపోయి ఉంటుంది. ఈ ఆడవాళ్లంతా ఇంతే అని ఇంకా ఎంతకాలం కూస్తూ ఉంటారు. మేం ప్రొటెస్ట్ చేస్తున్నామంటే ప్రొటెస్ట్ చేస్తున్నట్టే.'

ఆగింది.

నేను కాఫీ తాగుతూ చూస్తూ ఉన్నాను.

'మా వెధవకు చెప్పి చూశాను. ఒరే వద్దురా కనిపించినదాన్నల్లా తగులుకోవద్దురా

అని చెప్పి చెప్పి చూశాను. విన్నాడా. మీరంతా ఏమనుకుంటారంటే ఆ... దానికేం తెలుస్తుంది మన చాటు మాటు వ్యవహారం అనుకుంటారు. ఆడవాళ్లు గుడ్డివాళ్లట్రా. మీ ముకం నీడను చూసి కనిపెట్టగలరు మీరేం తప్పుడు పనులు చేసి ఇళ్లకు చేరుతున్నారో. కాని వింటార్రా మీరు'...

నన్నే అంటోంది.

చూస్తూ ఉన్నాను.

ఒక గుక్కతాగి స్థిమిత పడుతూ అంది.

'అందుకేలేండి. మీ సలహా పాటించి చేయాల్సిన శాస్తి చేశాను'

నేను చల్లగా అయిపోయాను.

'ఏం చేశారు?'

'ఏంటలా బిగుసుకుపోయారు?'

మామూలుగా కూచున్నాను.

'అంటే శాస్తి చేసేంత పని చేశాను. కొంచెంలో మిస్సయ్యాడు. ఏం లేదండి. వాడు తాగి నిద్ర పోతుంటే కొంచెం క్లోరోఫామ్ వాసన చూపించడానికి ట్రైయ్ చేశాను. అది సరిగ్గా నాకు చేతకాలేదు. బాగానే మత్తెక్కి ఉంటుందనుకున్నాను. కత్తి తీసుకొని వాడి చేతివేళ్లు కోసేశాను'

ఇప్పుడు నిజంగా నిలువెల్లా బిగుసుకుపోయాను.

'ఏంటలా చూస్తున్నారు? మీరేగా చెప్పారు'

'నేనేం చెప్పాను'

'గుట్టు చప్పుడు కాకుండా చేయండన్నారుగా'

'అయితే'

'ముందు వాడి ఎడమ చేయి బొటనవేలూ చూపుడువేలూ కోసేశాను. రక్తమే రక్తం. నా వల్ల కాలేదు. చాలా సాఫెస్టికేటెడ్ కిచెన్ వేర్ ఉంది మా ఇంట్లో. అలాంటి కత్తికి కూడా వేళ్లు తీసేయడమంటే కష్టమే అయ్యింది. మొత్తం పది వేళ్లూ తీసేద్దామనుకున్నాను. కాని నిజంగానే నా వల్ల కాలేదు. రెండు తీసే సరికి జాలి వేసింది. అదీగాక, వాడు అసాధ్యుడు కదా, అంత మత్తులో కూడా లేచి గగ్గోలు పెట్టి వేళ్లు వెతుక్కుని హాస్పిటల్‌కు పరిగెత్తాడు'

ఇక నేను చేయగలిగింది ఏమీలేదు.

కళ్లప్పగించి చూస్తూ ఉన్నాను.

'కారు డోర్‌లో పడ్డాయని చెప్పాడంట. వాళ్లకు తెలియకనా? కాని డబ్బిస్తే లొంగనిది ఎవరు? హుషప్ చేశాడు. నేను కూడా చూశాను. కేసు గీసూ అని గోల చేస్తాడేమో గొడవ చేసి బండారం బయటపడేద్దామని. కాని తేలు కుట్టినట్టు ఉండి పోయాడు'

చూస్తూ ఉన్నాను.

కాఫీ చాలా చల్లగా ఉంది.

'వేళ్లే ఎందుకు అని అడగరేం?'

'ఎందుకు?'

'ఎందుకు అనంటే– దెన్ వోన్లీ హి కాంట్ హోల్డ్ ది బ్రెస్ట్ ఆఫ్ అదర్ ఉమన్. హి కాంట్ ఫీల్ ది బాడీ ఆఫ్ అదర్ ఉమన్. ఈవెన్ హి కాంట్ హోల్డ్ హిజ్ థింగ్ వైల్'....

వినలేక ఎటో చూశాను.

ఆమె మళ్లీ బెంగగా అయిపోయింది.

తల కిందకు దించుకుంది.

కప్‌ను సాసర్ మీద మెల్లిగా రుద్దుతూ అంతలోనే ఎదురుగా దెయ్యాన్ని చూసినట్టుగా బిగుసుకుపోయింది. ఏమిటన్నట్టు చూశాను. ఒక్క ఉదుటున లేచి ఇన్నర్ స్పేస్‌లో నుంచి గ్లాస్‌డోర్ తీసుకొని ఓపెన్ ప్లేస్‌లోకి పరిగెత్తింది. తల తిప్పి కంగారుగా చూశాను. ఎవరో ఒకతను బ్లాక్ ప్యాంట్ బ్లాక్ షర్ట్ వేసుకొని ఇన్ చేసి ఉన్నాడు. అతడు రావడానికి చూస్తున్నాడు. ఆమె నిరోధిస్తూ ఉంది.

లేచి వేగంగా బయటికి వచ్చాను.

ఓపెన్ ప్లేస్‌లో హట్స్ ఉన్నాయి. టేబుల్సూ. కూచుని కాఫీలు తాగుతున్నవాళ్లూ. డిమ్ లైటింగ్.

ఇద్దరూ నన్ను చూశారు.

'ఏరా... ఎన్నిసార్లు చెప్పాను. కలవొద్దన్నాగా'

ఆమెను లాక్కుపోతున్నాడు.

ఆమె నిరోధిస్తోంది.

'వదులు... వదులు... ఇక్కడే ఉండనీ'

'ఏం చేస్తావ్... ఇరవైనాలుగ్గంటలూ... ఇలాంటివాళ్లతో'

లాగుతున్నాడు.

'వద్దు... నేన్రాను... నువ్వెళ్లు... చంపుకు'

'రా'

'నేన్రాను... ఉండనీ... ఇంట్లో పిచ్చెక్కుతోంది'

అందరూ చూస్తున్నారు. ఎవరూ అడ్డుపడే అమర్యాదకు పాల్పడ్డం లేదు.

'ఏయ్.. వదులు'

'నువ్వెవడివిరా?'

'వదులు'

కోపంగా, హితవు చెప్తున్నవాడిలా చూశాడు.

'దీన్తో పెట్టుకుంటే పోతావురా ఫూల్'

'నువ్వు హరాస్ చేస్తున్నావ్'

'నేను హరాస్ చేస్తున్నానా?'

తలాడించాడు.

'అలా చెప్పిందా? ఇంకా ఏమేం చెప్పింది. నా ఎడమ చేతి వేళ్లు కోసేశానని చెప్పి ఉంటుందే'

చూస్తూ ఉన్నాను.

లాగుతున్నాడు.

ఆమె ఏడుస్తూ విడిపించుకోవడానికి పెనుగులాడుతూ ఉంది.

'ఇదిగో చూడు'

చేయి చూపించాడు.

'నా ఎడమ చేయి. కోసేసిందా? చూడు. నా వేళ్లు చూడు' చూపించాడు.

అదిరిపోయి నిలబడ్డాను.

లాక్కుని పోతూ, బయటకి వచ్చి, పార్కింగ్ దాకా తీసుకువెళ్లి డోర్ తీసి ఆమెను లోపలికి తోశాడు.

బయటకు వచ్చాను.

స్ట్రీట్ లైట్స్ వెలుగుతున్నాయి.

ట్రాఫిక్.

చుట్టూ తిరిగి డ్రైవింగ్ సీట్ వైపు వెళుతూ ఉన్నాడు.

ఆమె కారులో తల కొట్టుకుంటూ ఏడుస్తూ ఉంది.

గమనించాను.

ఏంటది?

పరిగెత్తుకుంటూ వెళ్ళి గమనించబోయాను.

అతడు గమనించి వేగంగా కారుతీసి పరిగెత్తిస్తున్నాడు.

స్టీరింగ్ మీద చేతులు.

కుడి చేతికి స్కిన్ కలర్ గ్లవ్ ఉంది.

వెతికాను.

బొటనవేలూ చూపుడువేలూ కనిపించలేదు.

జూన్ 7, 2013